జల ఉద్యమం.. జనగర్జన

దుమ్మురేపిన చలో నల్లగొండ

జనసంద్రంగా సభా ప్రాంగణం • కేసీఆర్ రాకతో మిన్నంటిన కరతాళధ్వనులు

కేసీఆర్ స్పీచ్ ఆద్యంతం మార్మోగిన సభ

- హోరెత్తిన 'సీఎం'.. 'సీఎం'.. నినాదాలు
- సామెతలు, పంచులు, ప్రాసలతో కాంగ్రెస్‌ను ఆటాడుకున్న జననేత
- మళ్లీ ఉద్యమ కేసీఆర్ కనిపించాడంటూ సంబురం
- జననేత రాకకోసం గంటలపాటు ఎదురుచూపులు
- కేటీఆర్, హరీశ్‌రావు రాకతో రెట్టించిన ఉత్సాహం
- మాజీ మంత్రి మల్లారెడ్డికి ఫుల్‌క్రేజ్

జై తెలంగాణ నినాదం చేస్తున్న కేసీఆర్

కేసీఆర్ చలో నల్లగొండ సభకు ప్రజలు పోటెత్తారు.. నేల ఈనిందా అన్నట్టు సభా ప్రాంగణం మొత్తం జనంతో కిక్కిరిసిపోయింది.. కనుచూపు మేరలో ఏవైపు చూసినా జనసందోహమే ఇలా

నల్లగొండ నుంచి హైదరాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్ అధికారం కోల్పోయి మానసికంగా కుంగిపోయాడు.. తుంటికీలు శస్త్రచికిత్స తర్వాత శారీరకంగా కూడా బలహీనుడయ్యాడు.. ఇక కేసీఆర్ పని అయిపోయినట్టే..' ఇలా ఎన్నో కామెంట్లు, ఎన్నో అనుమానాలు. వాటన్నింటికీ నల్లగొండ సభలో చెక్ పెట్టారు కేసీఆర్. 'నన్ను ఏమన్నా పట్టించుకోను. కానీ, తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగితే మాత్రం పులిలెక్క కొట్లాడుతా' అని కేసీఆర్ తరుచూ చెప్పినట్టే.. మంగళవారం నల్లగొండలో నిర్వహించిన 'చలో నల్లగొండ' సభలో పులి మాదిరిగా గర్జించారు. పదేండ్లుగా ప్రాజెక్టులు పరాయిపాలు కాకుండా తాను అడ్డుగోడలా నిలిచి కాపాడితే.. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లోనే బోర్డులకు ఎలా అప్పజెప్పిందో ప్రజలకు వివరించి చైతన్యం చేశారు. ఈ ఒక్క సభతోనే సరిపోదని, మన నీళ్ల హక్కుల కోసం మరిన్ని ఉద్యమాలు చేయాల్సి వస్తుందని దిశానిర్దేశం చేశారు. 'మీరిచ్చిన అధికారంతో పదేండ్లు కష్టపడిన. ప్రతిపక్షంలోకి వచ్చినంక నాలుగొద్దులు ఆరాంగా రెస్ట్ తీసుకుందామనుకున్న. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తుంటే సహించలేక కుంటుకుంటనో, కట్టెపట్టుకొనో వచ్చిన' అంటూ తెలంగాణ మట్టిపై ఉన్న ప్రేమను మరోసారి చాటుకున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూనే.. మరోవైపు ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగిస్తే జరిగే నష్టాన్ని వివరిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. భవిష్యత్ ఉద్యమాలకు దిశానిర్దేశం చేశారు. 'నా కట్టె కాలే వరకు.. చివరి శ్వాస వరకు.. తెలంగాణ ప్రజల కోసం పులిలెక్క కొట్లాడుతా' అంటూ కార్యాచరణను ప్రకటించారు.

ఇదీ కేసీఆర్ అంటే..

'గతంలో ఉద్యమంలో ఉన్నం కాబట్టి ఉద్యమభాషలో మాట్లాడినం. ఇప్పుడు అధికారంలో ఉన్నం కాబట్టి బాధ్యతతో మాట్లాడాలె' అన్నది పదేండ్లుగా కేసీఆర్ ఆచరించిన సిద్ధాంతం. నల్లగొండ సభతో 'పాత' కేసీఆర్ మళ్లీ కనిపించారు. 'నల్లమొఖం ఎలుక పోయి సచ్చిన ఎలుకను పట్టుకొచ్చిందట.. పాలిచ్చే బర్రెను కాదని దున్నపోతును తెచ్చుకున్నరు..' ఇలాంటి ఎన్నో పంచులు, ప్రాసలు, సామెతలతో ప్రసంగాన్ని హోరెత్తించారు. దీంతో సభకు వచ్చినవాళ్లంతా 'ఇది కదా కేసీఆర్ అంటే.. ఇప్పుడు మా కడుపు నిండింది' అంటూ సంబురపడ్డారు. కేసీఆర్ సామెతలు వాడిన ప్రతిసారీ ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన కనిపించింది. 'రైతుబంధు అడిగితే చెప్పుతోని కొడుతా అంటరా? రైతులకు కూడా చెప్పులుంటయి.. అవి గట్టిగుంటయి.. వాటితో కొడితే ఒక్క దెబ్బకు మూడు పండ్లు రాలుతయి' అన్నప్పుడు సభలో ఉన్న రైతులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తంచేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఒక్క నిమిషం కూడా కరెంటు పోలేదని, ఇప్పుడు అసెంబ్లీలో కూడా జనరేటర్ పెట్టుకున్నరని విమర్శించగానే 'అవును' అంటూ ప్రజల నుంచి సమాధానం వచ్చింది. 'రైతుబంధు కూడా ఇవ్వడానికి శాతనైత లేదా?' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించగానే.. 'పడలేదు' అంటూ ప్రజలు సమాధానం ఇచ్చారు. 'సారు ఉన్నప్పుడు టైముకు పైసలు పడుతుండే. కాంగ్రెసోళ్లు డిసెంబర్‌లో అధికారంలోకి రాగానే రూ.15 వేలు ఇస్తమన్నరు. ఇప్పుడు రెండు నెలలైనా ఇస్తలేరు' అని హాలియాకు చెందిన సైదులు అనే రైతు వాపోయారు. 'రైతులను అవమానిస్తరా? ఎన్ని గుండెలురా మీకు? కండకావరమా? కండ్లు నెత్తికెక్కినయా?' అంటూ కేసీఆర్ విరుచుకుపడిన ప్రతి మాటనూ ప్రజలు హర్షధ్వానాలతో స్వాగతించారు. 'ఉయ్..' అంటూ రెట్టించిన ఉత్సాహం కనబరిచారు. 'ప్రాజెక్టులను బోర్డులకు అప్పగిస్తే పంటకు నీళ్లు కావాలన్నా.. తాగే నీళ్లు కావాలన్నా చిప్ప పట్టుకొని అడుక్కోవాలె' అన్న కేసీఆర్ మాటలు ప్రజల్లో ఆలోచన రేకెత్తించాయి. 'కేసీఆర్‌ను తిరుగనీయం అంటరా. ఏం చేస్తరు? సంపుతరా? సంపి మీరు తిరుగుతరా?' అన్నప్పుడు ప్రజలు కూడా భావోద్వేగానికి గురయ్యారు.

మేడిగడ్డనా.. బొందల గడ్డనా?

మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని నాలుగు నెలలుగా ఎదురవుతున్న ప్రశ్నలకు నల్లగొండ సభలో తెరదించారు. 'కాళేశ్వరం అంటే మేడిగడ్డ ఒక్కటే కాదు.. మూడు బరాజ్‌లు, పంప్‌హౌజ్‌లు, కాలువలు, సబ్‌స్టేషన్లు..' అని వివరిస్తున్నప్పుడు ప్రజలు చెవులు రిక్కించి విన్నారు. 'మేడిగడ్డలో ఉన్న వందల పిల్లర్లలో రెండుమూడు కుంగినయి. ఇట్లా ఎన్ని ప్రాజెక్టులకు జరగలేదు? నాగార్జునసాగర్‌లో కుంగలేదా? ప్రభుత్వం వాటికి మరమ్మతులు చేసి నీళ్లు ఎత్తిపోసి పంటలకు నీళ్లందించాలి. కానీ, కేసీఆర్ మీద కోపంతో నీళ్లు ఎత్తిపోసుడు బంద్ పెట్టిన్రు' అంటూ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టారు. ఇప్పటికీ ప్రాణహితలో నీళ్లు ఉన్నాయని, వెంటనే ఎత్తిపోయకపోతే సూర్యాపేటకు కూడా కావాల్సిన నీళ్లు రావని హెచ్చరించారు. దీంతో 'కొట్లాడి నీళ్లు తెచ్చేటోడు లేక కాలువలకు నీళ్లు రాలేదు. శానా ఏండ్ల తర్వాత మా పంటలు ఎండిపోయినయి' అంటూ సభలో ఉన్న నల్లగొండకు చెందిన సతీశ్‌రెడ్డి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పక్కనపెట్టి ఇతర అంశాలను మాట్లాడదని, కానీ తాను 'చలో నల్లగొండ' పిలుపు ఇవ్వగానే ప్రభుత్వానికి చెమటలు పట్టాయని, అందుకే ఆగమేఘాల మీద తీర్మానం పెట్టిందని ఎద్దేవా చేశారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఒక్కడే సమర్థంగా మొత్తం ప్రభుత్వాన్నే ఎదుర్కొన్నారని అభినందించగానే ప్రజలు హర్షధ్వానాలు చేశారు. 'మేం చలో నల్లగొండ అంటే.. వాళ్లు మేడిగడ్డకు పోయినరు. మేడిగడ్డ.. బొందల గడ్డ.. అనుకుంట తిరుగుతున్నరు. మేడిగడ్డ కాడ మీ తోకమట్ట ఉన్నదా?' అంటూ ధ్వజమెత్తడంతో ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు.

మల్లన్న క్రేజే వేరు

సభాప్రాంగణంపైకి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వచ్చినప్పుడు ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేస్తూ స్వాగతం పలికారు. ఆ తర్వాత మాజీ మంత్రి మల్లారెడ్డి వేదిక మీదికి రాగా.. సభికుల్లో ఉత్సాహం రెట్టించింది. మల్లారెడ్డి తనదైన స్టైల్‌లో రెండు చేతులు ఎత్తి అభివాదం చేయగానే మరింత ఉత్సాహం కనిపించింది. దీంతో 'మల్లన్న క్రేజే వేరు' అని సభికుల నుంచి కామెంట్ వినిపించింది. సభలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులు పాడిన పాటలకు ప్రజలు పెద్ద ఎత్తున స్పందించారు. ముఖ్యంగా 'ఏమాయెనే నల్లగొండ' పాటకు సభికుల నుంచి మంచి స్పందన వచ్చింది. నల్లగొండ జిల్లా ఉమ్మడి రాష్ట్రంలో ఎలా ఉండేది.. పదేండ్లలో ఎలా మారింది.. ఇప్పుడు ఏ దశలో ఉన్నదో పాటల్లో వివరించారు.

సీఎం.. సీఎం.. సీఎం

కేసీఆర్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ సభా ప్రాంగణం సమీపంలోకి వచ్చినప్పటి నుంచే ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన కనిపించింది. అందరూ కుర్చీల్లో నుంచి లేచి అభివాదం చేశారు. తర్వాత కేసీఆర్ స్టేజీ మీదికి వెళ్లి కుర్చీలో కూర్చునే వరకు చప్పట్లు, విజిల్స్‌తో స్వాగతం పలికారు. పిడికిలి ఎత్తి అభివాదం చేశారు. కేసీఆర్ ప్రసంగం ప్రారంభించగానే 'సీఎం.. సీఎం.. సీఎం' అంటూ నినాదాలు వినిపించాయి. ఆ తర్వాత కూడా రెండుమూడుసార్లు 'సీఎం.. సీఎం' అంటూ హోరెత్తించారు. దీంతో ఒక దశలో 'అపం డయ్యా బాబు' అని కేసీఆర్ అనాల్సి వచ్చింది. 'డబుల్ స్పీడ్‌తో మనం అధికారంలోకి వస్తాం' అని కేసీఆర్ అనగానే సభా ప్రాంగణం మొత్తం దద్దరిల్లింది. 'సారు లేకపోతే ఏమైతదో ఇప్పుడు అర్థమైతున్నది. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయి. కరంటు ఆగమైంది. రైతుబంధు ఆగిపోయింది' అని మిర్యాలగూడకు చెందిన కోటిరెడ్డి అనే రైతు వాపోయారు. 'అప్పుడు తప్పు చేసినం.. ఈసారి తప్పు చేయం. మళ్లా సారు వస్తేనే పరిస్థితి చక్కబడుతది' అని ఆశాభావం వ్యక్తంచేశారు. 'సారు మళ్లా సీఎం కావాలె. తెలంగాణ బాగుపడాలె' అని సురేశ్ అనే యువకుడు చెప్పారు.

సంప్రదాయానికి భిన్నంగా..

సాధారణంగా కేసీఆర్ తన పునరాగమన సభలను ఉత్తర తెలంగాణలో నిర్వహిస్తుంటారు. కానీ ఈసారి సంప్రదాయానికి భిన్నంగా దక్షిణ తెలంగాణ నుంచి ప్రారంభించారు. ఇదే సభను బీఆర్ఎస్ గెలిచిన సూర్యాపేటలో పెట్టుకునే అవకాశం ఉన్నది. కానీ.. అన్ని నీట్లు కోల్పోయిన నల్లగొండ జిల్లాలో సభ పెట్టడం ద్వారా తాను ప్రత్యేకమైన లీడర్‌ను అని నిరూపించుకున్నారు. సభకు పెద్ద ఎత్తున రైతులు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. సాయంత్రం 4 గంటలకు సభ కాగా.. ఉదయం 11 గంటల నుంచే సభా ప్రాంగణానికి ప్రజలు రావడం మొదలైంది.

నల్లగొండ జనసంద్రం

- అంచనాలను మించి బ్రహ్మరథం
- కిక్కిరిసిన రహదారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ మంగళవారం నిర్వహించిన చలో నల్లగొండ సభకు జనం పోటెత్తారు. అంచనాలకు అందని విధంగా ప్రజలు తరలిరావడంతో నల్లగొండ పట్టణం, నార్కట్‌పల్లి-అద్దంకి రహదారితోపాటు హైదరాబాద్-విజయవాడ హైవే సైతం కిక్కిరిసిపోయింది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పార్టీ ఆధ్వర్యంలో జరిగిన తొలి సభ సూపర్ గ్రాండ్‌సక్సెస్ కావడం బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కేసీఆర్ బహిరంగసభల్లో పాల్గొనడం ఇదే తొలిసారి. దీంతో ప్రజాస్పందన ఎలా ఉంటుందని రాష్ట్రం యావత్ ఆసక్తిగా చూసింది. పార్టీ నేతల అంచనాలకు సైతం అందని రీతిలో ఉదయం నుంచే జనప్రవాహం మొదలైంది. నల్లగొండ, తుంగతుర్తి, దేవరకొండ, మునుగోడు తదితర ప్రాంతాల నుంచి రైతులు ఎడ్లబండ్లు కట్టుకొని తరలివచ్చారు. కొంతమంది ట్రాక్టర్లలో వచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వందలాది ఆర్టీసీ బస్సులు మంగళవారం మధ్యాహ్నానికే సభా ప్రాంగణానికి చేరుకున్నాయి. చాలామంది ఇంటి నుంచే సద్దిమూటలు తెచ్చుకోగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కృష్ణానది పరివాహక ప్రాంత జిల్లాలతోపాటు చుట్టుపక్కల జిల్లాలైన వరంగల్, జనగామ నుంచి కూడా ప్రజలు తరలి రావడం విశేషం. నల్లగొండలో ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలు పట్టించుకోలేదు. మిట్టమధ్యాహ్నానికే సభావేదిక నిండిపోయింది. మధ్యాహ్నం 3 గంటలకల్లా నల్లగొండ చుట్టుపక్కల రోడ్లన్నీ ట్రాఫిక్ జాం అయ్యాయి. పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు నడుచుకుంటూ సభావేదిక వద్దకు చేరుకోవాల్సి వచ్చింది. సభ ముగిసిన తర్వాత కూడా మూడు, నాలుగు గంటలు నల్లగొండలో ట్రాఫిక్‌తోనే నిండిపోయింది.

నిమిష నిమిషానికి సీఎం కార్యాలయం ఆరా!

నల్లగొండ సభకు ఎంతమంది వచ్చారన్నదానిపై ముఖ్యమంత్రి కార్యాలయం నిమిష నిమిషానికి ఆరాతీసినట్టు తెలిసింది. స్థానికంగా ఉన్న ఇంటెలిజెన్స్ పోలీసు అధికారులు మేడిగడ్డలో ఉన్న ముఖ్యమంత్రికి ఎప్పటికప్పుడు సమాచారం అందజేసినట్టు తెలిసింది. సభకు భారీగా జనం వచ్చినట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు నివేదించినట్టు సమాచారం. నల్లగొండలో కేసీఆర్ సభ ముగిసిన తర్వాతనే మేడిగడ్డలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించడం గమనార్హం. నల్లగొండ జిల్లాలో ప్రతిపక్ష పార్టీ సభకు ఇంత భారీ స్థాయిలో ప్రజలు తరలిరావడాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊహించలేదు.

ఇష్టారీతి మార్కులతో ఇబ్బందులేనా?

నిజామాబాద్ జిల్లాలోని ఓ జెడ్పీ హైస్కూల్‌లో 30 మంది పదో తరగతి విద్యార్థులు వరుసగా దుమ్మాలు కొడుతున్నారు. వార్షిక పరీక్షలు సమీపించడంతో ప్రధానోపాధ్యాయుడు ఆ 30 మంది గైర్హాజరుపై ఆరా తీశారు. వివరాలు తెలుసుకొని ఇక నుంచి గైర్హాజరు కాబోమంటూ అందరూ లేఖలు రాయాలని సూచించారు. ఒక్కరంటే ఒక్కరు కూడా తప్పుల్లేకుండా రాయలేని పరిస్థితి. సదరు హెచ్ఎం డిక్టేషన్ చేయించినా శ్రీయత అన్న పదంలో శ్రీ అని కూడా సరిగ్గా రాయలేకపోయారు. ఇది క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితి.

కానీ, పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్, ఫార్మేటివ్.. ఏ పరీక్ష పెట్టినా పాస్ మార్కులు వచ్చేస్తున్నాయి. ఇంటర్నల్స్‌లోను మంచి మార్కులే సాధిస్తున్నారు. వార్షిక పరీక్షల్లోనూ ఫలితాలు ఉత్తమంగానే ఉంటున్నాయి. మరి అసలు విషయం ఏంటి?

- మూల్యాంకన విధానం సక్రమమేనా?
- సీసీఈ విధానంపై ప్రభుత్వం ఆరా
- అధిక మార్కులు సరికాదంటున్న ఉన్నతాధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల ఫలితాలపై రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు అనుమానం తట్టింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఒకలా ఉంటే ఉత్తమ మార్కులు రావడం ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలు వారిలో తలెత్తాయి. అసలు మూల్యాంకనం సక్రమంగా చేస్తున్నారా? లేక ఉపాధ్యాయులు ఇష్టారీతిన మార్కులేస్తున్నారా? అన్న సందేహం వచ్చింది. దీంతో మూల్యాంకనంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఆరా తీశారు. పాఠశాల విద్యాశాఖపై ఇటీవల నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలోనూ ఇదే విషయంపై ఉపాధ్యాయులను, అధికారులను ఆయన ప్రశ్నించారు. అంతా సవ్యంగానే జరుగుతున్నట్టుగా ఉపాధ్యాయులు చెప్పారు. అయినా అనుమానం వీడకపోవడంతో విద్యార్థుల జవాబుపత్రాలను తెప్పించుకుని తాను పరిశీలిస్తానన్నారు. ఈ ఏడాది, నిరుటి మూల్యాంకనం చేసిన పేపర్లను తాను పరిశీలిస్తానని సభాముఖంగానే తేల్చిచెప్పారు. ఇలా ఇష్టారీతిలో మార్కులు వేయడం సరికాదని ఆయన హితవు పలికారు.

సీసీఈపై త్వరలో ఉన్నతస్థాయి సమీక్ష

సీసీఈ, సహా మూల్యాంకన విధానంపై త్వరలోనే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీనిని సరిదిద్దాలని విద్యాశాఖకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. ఆర్టీఈ యాక్ట్ ప్రకారం రాష్ట్రంలో 2014-15 విద్యాసంవత్సరం నుంచి పాఠశాల విద్యలో నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాన్ని (సీసీఈ) ప్రవేశపెట్టారు. సీబీఎస్ఈని అనుసరించి మన రాష్ట్రంలోనూ మార్కుల స్థానంలో గ్రేడింగ్ విధానాన్ని అనుసరిస్తున్నారు. దీంట్లో భాగంగా పరీక్షలకు 80, ఇంటర్నల్స్‌కు 20 మార్కులు కేటాయించారు. అయితే విద్యార్థుల్లో కొందరు చదివి, రాయగలిగే సామర్థ్యాలు లేకపోయినా మార్కులు మాత్రం భారీగానే సాధిస్తున్నారు. పదో తరగతిలోనూ ఉత్తీర్ణులవుతున్నారు. ఇలాంటివారు ఇంటర్‌కు వచ్చేవరకు బొల్తా పడుతున్నారు. దీనికి మూల్యాంకన విధానం సక్రమంగా లేకపోవడమే కారణమన్న భావన అధికారుల్లో వ్యక్తమవుతున్నది.

ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు రెండే ఉండాలి: రాజా భానుచంద్రప్రకాశ్

సీసీఈ విధానంలో ప్రస్తుతం నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను పెడుతున్నారని, దీనిని రెండుకు కుదించాలని ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజా భానుచంద్రప్రకాశ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సమ్మేటివ్ పరీక్షలను రెండుగానే కొనసాగించాలని ఆయన సూచించారు.

ఎల్‌అండ్‌టీని బెదిరించిన మాజీ ఎంపీ ఎవరు?

కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 13: మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మించిన ఎల్‌అండ్‌టీ కంపెనీని ఓ మాజీ ఎంపీ బెదిరించి తన బంధువులకు సబ్ కాంట్రాక్ట్ ఇప్పించుకున్నారని విమర్శలు చేస్తున్న బండి సంజయ్.. దమ్ముంటే ఆ మాజీ ఎంపీ ఎవరో చెప్పాలని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంపీ బండి సంజయ్ విమర్శిస్తున్నట్టు.. ఆ మాజీ ఎంపీ తానా? లేక పొన్నం ప్రభాకరా? కేసీఆరా? చెన్నమనేని విద్యాసాగర్‌రావా? ఎల్ రమణనా? అని ప్రశ్నించారు. పేరు చెప్పే ధైర్యం లేకుండా ఉత్త ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరని తెలిపారు. ఎల్‌అండ్‌టీ అనేది ఓ మల్టీనేషనల్ కంపెనీ అని, అలాంటి సంస్థలు ఇలాంటి ప్రాజెక్టులను సబ్ కాంట్రాక్ట్‌కు ఇస్తాయని తాను అనుకోవడం లేదని చెప్పారు. ఎంపీగా గెలిచిన తర్వాత ఐదేండ్లుగా కనిపించని బండి సంజయ్.. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. ఐదేండ్లలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.5 కూడా తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ఏండ్ల తరబడి అమలు చేస్తున్న ఉపాధి హామీ, తదితర పథకాలకు కూడా తానే నిధులు తీసుకొచ్చానంటూ పెద్ద పెద్ద పోస్టర్లు వేసుకోవడం బండి సంజయ్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఈ సారి ఎన్నికల్లో ఓడిపోతానన్న భయంతోనే బండి సంజయ్ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో గంగాధర ఎంపీపీ మధుసూదన్, బీఆర్ఎస్ నాయకులు హమీద్, జక్కుల నాగరాజు, దూలం సంపత్‌గౌడ్, వోల్లాల శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నాగార్జునసాగర్'లో ఎన్‌డీఎస్ఏ సందర్శన

- మూడు రోజులపాటు డ్యామ్‌ను పరిశీలించనున్న టీమ్
- ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించే భాగంలోనే సమీక్ష

హిల్‌కాలనీ విజయవిహార్‌లో ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేశ్

నందికొండ, ఫిబ్రవరి 13: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) టీమ్ మంగళవారం నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించింది. నందికొండ హిల్‌కాలనీలోని అతిథి గృహం విజయవిహార్‌కు చేరుకున్న సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేశ్, ఎన్‌డీఎస్ఏ సీఈ ప్రమీల, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ విజయలక్ష్మి, డీఈఈ సతీశ్, కేఆర్ఎంబీ సభ్యులకు ఎన్నెస్పీ సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ నాగేశ్వర్‌రావు పుష్పగచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించే ప్రక్రియలో భాగంగా డ్యామ్‌ను పరిశీలించాల్సిన అంశాలపై బృందం సభ్యులు తెలంగాణ, ఆంధ్ర ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం నాగార్జునసాగర్ డ్యామ్, గ్యాలరీ, క్రస్ట్ గేట్లు, వాక్‌వే బ్రిడ్జి, స్పిల్‌వేలను పరిశీలించారు. గత నెల కేంద్ర జలశక్తి నేతృత్వంలో తెలంగాణ, ఆంధ్ర ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయంలో భాగంగానే సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేశ్ ఆధ్వర్యంలో ఎన్‌డీఎస్ఏ, కేఆర్ఎంబీ బృందం సభ్యులు నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించారు. డ్యామ్ భద్రత, నీటి నిల్వల వినియోగం అంశాలను ఆరా తీశారు. బుధవారం ఎడమ, కుడి కాల్వలు, జలవిద్యుత్తు కేంద్రాలను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. వారి వెంట తెలంగాణ ఈఈ మల్లికార్జున, డీఈఈలు శ్రీనివాస్‌రావు, పాపారావు, ఏఈలు కృష్ణయ్య, సత్యనారాయణ, ఆంధ్ర ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్యే కారుకు ప్రమాదం

- లాస్య కారును ఢీకొట్టిన మరో కారు
- విధుల్లో ఉన్న హోంగార్డు మృతి
- ఎమ్మెల్యే లాస్య నందితతోపాటు మరో కానిస్టేబుల్‌కు గాయాలు
- నల్లగొండలో రోడ్డు ప్రమాదం

హోంగార్డు మెరుగు కిశోర్ (ఫైల్)

నీలగిరి/కంటోన్మెంట్, ఫిబ్రవరి 13: నల్లగొండ మండలం చర్లపల్లిలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కారును ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి బలంగా ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో విధుల్లో ఉన్న హోంగార్డు మృతిచెందారు. ఎమ్మెల్యే లాస్య తలకు గాయాలయ్యాయి. మరో కానిస్టేబుల్ కూడా గాయపడ్డారు. నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం చలో నల్లగొండ బహిరంగ సభ అనంతరం ట్రాఫిక్ సమస్య రాకుండా జిల్లా కేంద్రం సమీపంలోని చర్లపల్లిలో జంక్షన్ వద్ద నల్లగొండకు చెందిన కానిస్టేబుల్ శ్రీనివాస్, నార్కట్‌పల్లి హోంగార్డు మెరుగు కిశోర్ (42) విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి నల్లగొండవైపు వేగంగా వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందిపైకి వెళ్లింది. ముందుగా హోంగార్డు కిశోర్‌ను ఢీ కొట్టడంతో అతడు రోడ్డుకు అవతల వైపు ఎగిరి పడ్డాడు. అదే కారు ఎదురుగా వస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కారునూ ఢీకొట్టింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కారు అదుపు తప్పి కింద పడిన హోంగార్డు కిశోర్ మీదుగా వెళ్లింది. తీవ్రంగా గాయపడిన కిశోర్‌ను దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. స్వల్ప గాయాలైన కానిస్టేబుల్ శ్రీనివాస్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

నల్లగొండ చర్లపల్లి దగ్గర ప్రమాదానికి గురైన ఎమ్మెల్యే లాస్యనందిత కారు... ఇన్‌సెట్‌లో లాస్య నందిత

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్యకు గాయాలు

కారు ఢీకొన్న ఘటనలో ఎమ్మెల్యే లాస్య తలకు గాయాలయ్యాయి. అదే కారులో ఎమ్మెల్యేతోపాటు ఆమె సోదరి నివేదిత, ఇద్దరు గన్‌మెన్లు ఉన్నారు. వీరికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం అక్కడి నుంచి వేరే కారులో హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యే లాస్యనందిత కారు ప్రమాదానికి గురైందన్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో ఆమెను పరామర్శించారు. ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు గౌడ్‌తోపాటు బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఆశావహ అభ్యర్థి చామకూర భద్రారెడ్డి ప్రమాద ఘటనపై ఆరా తీశారు. లాస్య నందితను ఫోన్‌లో ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.